రోహిణికార్తె ఎండలకు నిజంగానే రాళ్ళు పగులుతున్నాయి. చెట్లమీది పక్షులన్ని బెదిరిపోయినట్లు నోళ్లు తెరుచుకొని, గుడ్లు మిటకరించి నాలుగు వైపుల చూస్తున్నాయి. దూరంగా వేపచెట్ల క్రింద చిల్లులు పడిన గిన్నెలకు మాట్లు వేస్తున్న కరీం సాయిబు, కొలిమితిత్తి కొట్టకుండా దిక్కులు చూస్తున్న ఎనిమిదేళ్ల కొడుకును చివాట్లు వేస్తూ తన పని తాను చేసుకు పోతున్నాడు.

శింగన పాలెం గ్రామం చుట్టూ తోటలు, గ్రామంలోనే పెద్ద పెద్ద చెట్లు వున్నాకాని సూర్యుడి ప్రభావం మాత్రం ఆ గ్రామం మీద ఏ మాత్రం తగ్గలేదు. వయస్సు మళ్లిన వాళ్లంతా కలోగంజో తాగి కడుపు నింపుకొని ఇళ్ల వసారాల్లో నులక మంచాల మీద పడుకొని ఇప్పటి ఎండల తీవ్రత గురించి, తాము చూసిన ఇదివరకటి వేసవి కాలాల తాలూకు మండు టెండల గురించి ప్రక్కవాళ్లతో కబుర్లు చెబుతూ నిట్టూరుస్తున్నారు.

"ఏంది మాఁవాఁ తీరిగ్గా కూసుండావు—పట్నం ఎల్లలేదా?" అప్పుడే నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని వచ్చి, పైగుడ్డతో ముఖానికి పట్టిన చెమటను తుడుచుకొని పంచ అరుగుమీద కూర్చుంటూ అడిగాడు శివయ్య.

"లేదురా—ఎల్లలేదు" చుట్ట చుట్టుకోడానికి పొగాకు కాడను తీసి సరి చేస్తూ అన్నాడు భూషయ్య.

"అవునులే—ఎండలిట్టా మండిస్తావుంటే ఎవరు మాత్రం గడపదాటి బయటకెల్తున్నారు? ఎండాకాలం వొస్తే మన పంచాయతి రాజకీయాలక్కూడా శలవులేగావాఁల—



ఇస్కూలు మాదిరి'' శివయ్య మాటలు చురుక్కున తగిలాయి భూషయ్యకు.

భూషయ్య పెద్ద ఆస్తిపరుడే కాని, వ్యవసాయం అంటే అతనికి మహావిరాకు. అందుకే అతను ఎప్పుడూ పంచె పైకి ఎగకట్టి గట్టు దిగి పొలంలో అడుగుపెట్టడు. అందుకే అతనికి వ్యవసాయంగురించి ఏమాత్రం తెలియదని, కాబట్టే రాజకీయాల్లోకిదిగి తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మినిచేసే నెట్టుకొస్తున్నాడని ఆ వూళ్ళో శివయ్యలాంటివాళ్లు చాలామంది అంటుంటారు. దానికితోడు భూషయ్య నెలకు ఇరవై రోజులదాకా రాజకీయాల్లో మునిగితేలుతూ ప్రక్కనేఉన్న బస్తీలో గడుపుతుంటాడు. భూషయ్య ఎప్పుడన్నా గ్రామంలో కనపడినా, తీరుబాటుగా ఉన్నట్లు కన్పించినా శివయ్య అతనిని ఆటలు పట్టిస్తూంటాడు. ఊళ్ళోని పెద్ద మోతుబరిరైతుల్లో ఒకడైన శివయ్య ఎన్నివిసుర్లు విసిరినా వాటిని చిరునవ్వుతో కొట్టేస్తుంటాడు భూషయ్య.

''నీకేం తెలుసురా రాజకీయాలగురించి—దిగితేకాని లోతు తెలీదు'' చుట్ట వెలిగించి అన్నాడు భూషయ్య.

''నిజమే మావా — రాజకీయాల్లో లోతులు నీకెంతమాత్తరం తెలుసునోకాని, ఇయ్యాల అంకమ్మగుడిదగ్గర మంచినీళ్ళబావి ఎంతలోతుందో నేను చూశాను.''

భూషయ్య శివయ్యవైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

''ఏందయ్యా అట్టా చూస్తావ్? సిత్త కార్తిలో పడిన సినుకులేకాని మళ్ళీ వొర్సమే లేదాయె. అంకమ్మగుడి బావిలో తప్ప, వూళ్ళోని మిగిలిన బావులన్నింటితోనూ బురదలు దోర్చుకుంటున్నారు. గుడిబావి కూడా అంతంత మాత్తరంగా ఉంటే, ఇయ్యాల పూడిక తీశారు. ఈ ఎండాకాలాం ఎట్టా గడుస్తదో ఏమో?'' — శివయ్య మాటలకు భూషయ్య బదులుపలకలేదు. నోట్లో చుట్టతీసి తుపుక్కున ఉమ్మేసి నిట్టూర్చాడు.

''ఇది ఇన్నావంటారా — మాదిగోళ్ళ పాలెంలో కొత్తగా తవ్వించిన బావి పూర్తిగా ఎండిపోవచ్చిందంట. అళ్ళ పాతబావి సంవత్సరాది పండక్కే ఎండిపోయింది. పిల్లలు సత్తన్నారంట బురదలు తాగలేక.'' శివయ్య మాటలువిని బయటకు వచ్చిన భూషయ్యభార్య చంద్రమ్మ అంది.

''అళ్ళకంతే కావాల్లే అప్పా! లేకపోతే ఏదవనాయాళ్లు మానూళ్ళ సమయానికి కూలిరేట్లు పెంచేసి ఏడిపిస్తారా? ?—'' శివయ్య కసిగాఅన్నాడు.

''అళ్ళు మరీ నెత్తినెక్కి కూర్చుంటున్నారురా— పెబుత్వంకూడా ఆళ్లపక్కనే సేరి అళ్ళకు ఇళ్లు వాకిళ్లు కట్టించి, బావులు తవ్వించి, బంజర్లకు పట్టాలు ఇస్తా వుండె. ఇంక ఆళ్లకు కళ్లు కనపడుతున్నాయా?''

''అట్టా అనకూడదు లే అప్పా! రేపు ఎలచ్చన్లలో ఆళ్ల ఓట్లే మనకు దిక్కు.'' శివయ్య ఓరకంట భూషయ్యను చూస్తూ అన్నాడు.

భూషయ్య విసురుగా చుట్టతీసి, ఉమ్మేసి, ''ఏడిశారు— ఆ సన్నాసులు ఓట్లెయ్యకపోతే మనం గెలవలేమా? పచ్చనోట్లకు, కల్లుముంతలకు కళ్లు బైర్లుకమ్మి ఓట్లేసే నాయాళ్ళకు పెద్దపట్టం కడుతున్నారు ఆ పైవోళ్లు''- అన్నాడు కర్కశంగా.

''అదేందయ్యా అట్టాఅంటావ్? ఆళ్లకు బంజర్లు పట్టాలు ఇయ్యడానికి మంతిరొచ్చినప్పుడు నువ్వేగా—అళ్ళంతా పైకిరావాలని ఉపన్యాసాలు దంచింది—''

శివయ్యమాటలకు భూషయ్యకు చిర్రెత్తుకొచ్చింది.

''ఒరేయ్ శివాయ్! నీకు రాజకీయాలు తెలీవుగాని ఊరుకో—ఎప్పుడెట్టా మాట్టాడలో అట్టా మాట్టాడి పబ్బం గడుపుకోవాలి—'' అంతకుమించి ఎంతచెప్పినా, ఏమి చెప్పినా శివయ్యకు అర్థం కాదని భూషయ్య మౌనం వహించాడు.

ఇంతలో దూరంగా వేపచెట్ల క్రింద గిన్నెలకు మాట్లు వేస్తున్న కరీంసాయిబు గొంతు బిగ్గరగా, ఆందోళనగా విన్పించింది.

''అయ్యో! ఎట్టాగరా పుల్లిగా! సాయిబులబావికూడా నిన్నటినుంచి ఎండిపోయింది. ఇంకా భగమంతుడే కాపాడాల—''కరీంసాయిబు మాటలు పూర్తయీ, కాకుండానే ఏదో గందరగోళం విన్పించింది.

''ఏందిరా శివయ్యా-ఆ గందరగోళం?'' భూషయ్య మాటలు ఇంకా పూర్తి కాకుండానే మునసబు, మోతుబరి రైతులు శేషన్న, వెంకటయ్య, నారయ్య, పిచ్చయ్య, కరణం అంతా హడావుడిగా భూషయ్య ఇంటి లోగిట్లోకి వచ్చారు. ఊరి పెద్ద లందరు ఒక్కసారిగా కట్టకట్టుకొని రావడం చూసి ఆశ్చర్యపోతూ, ''ఒరేయ్ పోలిగా! కుర్చీలు తేరా పెద్దోళ్లంతా వొచ్చారు''అని పాలేరును కేకవేశాడు భూషయ్య.

> **నాపేరు జ్యోతి**
>
> — కృష్ణప్రియ
>
> పూజించగ ప్రతిఒక్కరు
> వెలిగింతురు నా తనువును
> మదినిండిన కోరికతో
> దేవునిపై ధ్యానముంచి;
> తృప్తిదీర దర్శించి
> భక్తిమీర తలుతురు
> పెనుగాలికి అల్లాడెదు
> నను తలపంగ నేరరు!
> నన్ను నేను దహియించి
> నలుదెసల వెలుగునింపి
> అంధకార మందిరమున
> మలిగిపోదు నెప్పుడో!

భూషయ్య భార్య లోపలికి వెళ్లిపోయింది. పోలిగాడు పంచ అరుగుల మీద అందరికి కుర్చీలు వేశాడు.

''ఏందయ్యా — అంతా ఆదరాబాదరాగా వొచ్చారు కొంపలు మునిగిపోయినట్టు'' అని నవ్వాడు భూషయ్య.

''కొంపలు మునిగినట్టని ఇంకా నెమ్మదిగా అంటావేంది భూషయ్యమావా — నిజంగానే మునిగాయి. నీకేం కడుపులో నల్ల కదలకుండా కూసుంటావు లేకపోతే రాజకీయాలు నడపడానికి పట్నం పోతావు. ఊళ్ళో ఇసయాలు నీకేమయినా పట్టినయ్యా'' — మునసబు నిష్టూరంగా అన్నాడు.

''ఇంతకీ అసలు ఇసయం ఏంది మునసబూ''-భూషయ్య కరిమీసాన్ని సన్నగా దువ్వి మెల్లిగా నవ్వాడు.

''ఆ ఇసయం అంట సెప్పండయ్యా'' అసహనంగా అందరివైపు చూసి అన్నాడు మునసబు.

''ఏంలేదు భూషయ్యా! మన గామంలో మొత్తం మూడు మంచినీళ్ల బావులు వున్నాయిగదా! అందులో సాయిబుల బావి నిన్నటి నుంచి పూర్తిగా ఎండిపోయింది. ఇయ్యాల మాదిగపాలెం బావి ఎండిపోయింది. ఇంక మనం నీళ్లు తెచుకొనే అంకమ్మ గుడి బావి ఒక్కటే ఇప్పుడు అందరికి ఆధారమై పోయింది. ఇప్పుడు మాదిగపాలెం అంతా

**దీర్ఘరోగులకు ఉత్తమ సిద్ధ వైద్యం!**



హస్తప్రయోగం, అంగంచిన్నదై అవసరకాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. వరిబీజం (బుడ్డ), మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండ. రండి.

డా. దేవర, ఫోన్:551, మార్వాడి గుడివద్ద, తెనాలి, బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు—17.

**35సం॥ అనుభవం**
**వరిబీజము బుడ్డలు బీజకుట్లు మొదలగు వ్యాధులకు ఆపరేషన్ లేకుండా గ్యారంటిగా బాగుచేయబడును**
వివరములకు: **రా** అండ్ **కో** ఆసుపత్రి
గౌలిగూడ నయ బస్ డిపో ఎదుట, రామ్ మందిర్ రోడ్, హైదరాబాద్-12 ఆ.ప్ర
ఆఫీస్ ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38544

**అజీర్ణం వల్ల మీరు భయపడుతున్నారా?**
**హ్యూలెట్స్ మిక్స్చర్ తీసుకొని - తిరిగి తినడం ప్రారంభించండి**




సి.జె.హ్యూలెట్ & సన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 600 002, కలకత్తా 700 001
SAA/CJH/1191

# దాహం

గుక్క తడుపుకోను నీళ్ళబొట్టు లేక కటకట లాడి పోతున్నారు. మన గుడిబావి నుంచి నీళ్ళు ఇప్పించమని అడగడానికి మాదిగపాలెం వాళ్ళంతా కట్టకట్టుకొని వస్తున్నారని తెలిసి నీకు చెబ్దామని ఇట్టా వచ్చాం'' శేషన్న పూర్తిచేసి అందరివైపు చూశాడు.

''ఆ ఎదవ నాయాళ్ళు నీళ్ళు లేకుండా అరసకలాడి సచ్చినా మేలేగాని గుడిబావి నుంచి ఆళ్ళకి ఒక్క సుక్క కూడా ఇయ్యడానికి ఈల్లేదు''శేషన్నమాటలు పూర్తి కావటంతోనే పిచ్చయ్య అరిచినంత పనిచేశాడు.

''బాగా సెప్పావు సిన్నాయనా! మొన్నటికి మొన్న మాసూళ్ళల్లో ఆళ్ళెంత ఏడిపించారు మనల్ని?— తెల్లారి లేస్తే గంజినీళ్ళకు గతి లేక కాళ్ళమీదపడే ఈ నాయాళ్ళు పొరుగూరి వాళ్ళతో సమంగా కూలి ఇస్తేకాని పొలంలో అడుగు పెట్టమని మొరాయించలేదూ? సివరకు ఎంత ఖర్చుసేసి పొరుగూళ్ళ నుంచి కూలోళ్ళను తెప్పించాం? ఇయ్యాల బావిఎండి పోబట్టిగాని లేకపోతే ఆళ్ళకు మనం కనబడుతున్నామా?''నారయ్యకసిగా అన్నాడు.

''బంజర్లకు పట్టాలు వచ్చిన కాడ్నించి ఆళ్ళకు పట్టపగ్గాల్లేకుండా పోయాయి ఆళ్ళ దగ్గర ఎరువుందా? ఎద్దులున్నాయా? ఏం పెట్టి ఎవసాయం చేస్తారని ఇచ్చారయ్యా పట్టాలు?'' బంజరుభూములు తనకు దక్కలేదన్న అక్కసుతో అరిచాడు వెంకటయ్య. పట్టాలు ఇవ్వడానికి భూషయ్యే కారణం అన్నట్టు అతని వైపు సూటిగా, ఎర్రగా చూశాడు వెంకటయ్య.

''నన్నేం సెయ్యమంటావన్నా— పెదాన మంతిని కాడ్నించి పంచాయతి నెంబరుదాకా అంతా హరిజనులు ముందుకు రావాలంటూ అరుస్తావుండె. నన్నొక్కడ్ని ఏం సెయ్యమంటావ్? ఇప్పుడైనా పోయిందేముంది? ఆళ్ళ సేద్యానికి మనమేగా అప్పు పెట్టాల్సింది— అందుకు ఆపంట రాబట్టుకొంటే సరిపోలా? కష్టంలేకుండా ఇంటి ముందుకు గింజలు వస్తాయి''—భూషయ్య అన్నాడు.

''ఆదంతాసరే—ఇప్పుడు ఆళ్ళు బావి మీదకు వస్తున్నారు—ఏం చెబుదాం?''శేషన్న ప్రశ్నించాడు.

''ఆఁ అది తేల్చండి ముందు''కరణం రెట్టించాడు.

''ఆళ బావికి పూడికతీసే నీళ్ళురావా?'' భూషయ్య సాలోచనగా అన్నాడు.

''ఇంక ఆళ్ళ బావిలో గడ్డపలుగేస్తే మొత్తం కూలిపోద్ది. అంతలోతు తవ్వారు ఆ బావిని ఇప్పటికే'' పిచ్చయ్య అన్నాడు.

''మరి సాయిబులెట్టా గడుపుకుంటున్నారు?''భూషయ్య అడిగాడు.

''రెండిళ్ళేకదా సాయిబులవి. ఒక్క కరీం సాయిబు, ఆడికొడుకు తప్ప, మిగిలిన వాళ్ళందరూ పట్నం పోయారు ఆళ్ళిద్దరూ కూడా సాయంత్రం బస్సుకు పోతారంట''నారయ్య అన్నాడు.

ఇంతలో వీధిలో కోలాహలం విన్పించేసరికి అంతా అటువేపు చూశారు. మాదిగపాలెం పెద్దపుల్లిగాడు ముందునడుస్తుండగా అతని వెనక మొత్తం పాలెం అంతానడిచి భూషయ్య ఇంటికి అల్లంత దూరంలో ఆగింది.

''అయ్యా! ఇయ్యాల్టితో మా పాలెంలో మంచినీళ్ళ బావి ఎండిపోయిందయ్యా. పిల్లా, మేకా గొంతు తడుపుకోను కూడా లేకుండా అవస్థపడుతున్నారు. అంకమ్మగుడి బావి నుంచి నీళ్ళు ఇప్పించండయ్యా?'' పుల్లిగాడు వీధిలోనే చతికిలబడి కూర్చుని చేతులు జోడించి దీనంగా అర్థించాడు.

కొద్దిక్షణాలు పెద్దల్లో ఎవరూ మాట్లాడలేదు. చివరకు మునసబు కోపంగా అరిచాడు.

''నాయాల్ది ఇయ్యాల కన్పించామంటా మేము మీకు? మా సూళ్ళల్లో మమ్మల్ని మూడు చెరువుల నీళ్ళు తాగించిన్నాడు మేమంతా మీ కంటికి పురుగుల్లా కన్పించాం కదూ?''—

''ఆయేల న్యాయంగా అందరితోపాటు సమంగా కూలిగింజలు ఇప్పించమని అడిగాం కాని ఇంకేమన్నాం?'' పట్నంలో పెద్ద చెప్పుల కంపెనీలో ఉద్యోగం చేస్తూ శెలవుమీదవచ్చిన కొండడు అన్నాడు.

''ఇంకాకూడా ఏమైనా అంటావ్రా— అనరూమరి?— పొలిమేరలుదాటి పట్నంపోయి నేర్చుకొచ్చిన తెలివితేటలు అన్నీ అవేగా.'' —శేషన్నమొహం కందగడ్డలాతయారైంది.

''దొరా! అట్టా కోపగించుకోకండి. ఆడు మాత్తరం ఏమన్నాడు. న్యాయంగా కూలి ఇమ్మని అడిగాం కదా అనే వాడన్నాడు. మున్నూట అరవై రోజులూ మీ గడపల కాడు పడి బతికేవోళ్ళం. మమ్మల్ని కనికరించి



తగ్గింపు ధరలు వారము రోజులు పొడిగించడమైనది.

ఉచితం

ది. 1-2-75 నుండి 31-3-75 వరకు మా వద్ద కొన్న

ప్రతి రూ. 100/- లు విలువగల సామానుకు } ఒక హార్లిక్సు సీసా ఉచితముగా యివ్వబడును.

ప్రతి రూ. 50/- లు విలువగల సామానుకు } ఒక బ్రూ కాఫీ (50 గ్రా) సీసా ఉచితముగా యియ్యబడును.

నోబుల్ హౌస్ గ్లాస్, ప్లాస్టిక్‌వేర్, క్రోకరీ & గిఫ్ట్ ఆర్టికల్సు, మెయిన్‌రోడ్డు - కాకినాడ.

(Authorised dealer for A.G.I. Glass ware)

ఆకర్షణీయమైన బహుమతులు! అందమైన బహుమతులు!!

1-2-'75 నుండి ప్రారంభం!

ఎక్కడో కాదు — మీ అభిమాన వస్త్రాలయం

శ్రీ లక్ష్మి

బొంబే డయింగ్‌లో

KANTA CHAP

వస్త్ర నాణ్యతకి, సరిక్రొత్త డిజైన్సులకి పేరు పొందిన

బొంబే డయింగ్ మిల్సువారి శ్రీలక్ష్మిలో పిన్నలకు, పెద్దలకు నేటి యువతరం వారికి ఎన్నికైన అన్ని రకాల వస్త్రాలు ఖరీదు చేసి బిల్లు అమౌంటుపై అందమైన ఉచిత బహుమతులు పొందండి. త్వరపడండి "బహుమతి" వస్తువులు స్టాకు వున్నంతవరకు మాత్రమే.

ఇట్లు

బొంబే డయింగ్ షోరూం,

"శ్రీలక్ష్మి" [శ్రీ లక్ష్మి క్లాత్ స్టోర్సు బిల్డింగ్‌పైన]

కొత్తగూడెం.

## దాహం

ఇన్ని నీళ్లు ఇప్పించండయ్యా" – పుల్లిగాడి పెత్తండ్రి మునిలిగాడు ప్రాధేయ పూర్వకంగా అన్నాడు.

"అవున్రా – మీకు న్యాయం కావాలి. న్యాయం. మాకాడ తీసుకొన్న బాకీలల్లోకి సెల్లెయ్యడానికి గతిలేని ఎదవలకు – మీకు న్యాయమే కావాల్రా. అర్ధరాత్రనక, అపరాత్రనక మీకు అప్పులిచ్చినందుకు ఆయేళ బాగా బుద్ధి చెప్పారు" పిచ్చయ్య విసురుగా అన్నాడు.

"మాకు వూరికేనే ఇచ్చారా అప్పులు ? నూటికి పదిరూపాయలు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఎంత సెల్లేసినా, మీ ఇళ్లకాడ బడి అందరం ఎంత కాయకష్టం చేసినా మీ లెక్కల ప్రకారం ఆ బాకీలు ఎప్పటికీ తీరవాయె!" మా ఆడోళ్ల మెళ్లో పుస్తెల కాడ్నుంచి, గొడ్డు గోదా దాకా అంతా మీ ఇళ్లకు చేరినాకాని మీరిచ్చిన అప్పులు ఇంకా అట్టాగే వుంటాయి. సివరికి నోరు తెరిచి నాయం అడిగితే మాది తప్పై పోయింది." పారుగూరి హైస్కూల్లో టీచరుగా పనిచేస్తున్న వీరయ్య ఆవేశంకొద్దీ అరిచాడు

"ఒరేయ్ వీరిగా! నోరు పారేసుకున్నావంటే మర్యాద దక్కదు జాగత్త. ఏం చూసుకొనిరా ఆ అహంకారం ? నీ ఉద్యోగం ఊడగొట్టడం నిమిషాలమీదపని తెలుసా ? సచ్చిన గొడ్లను కోసుకొనే నాయాళ్లు కూడా మాటలు నేర్చి మాకు ఎదురునిల్చి జవాబులు చెప్తున్నార్రా ?" – భూషయ్య కళ్లు చింత నిప్పుల్లాగా మండాయి. అతని అరుపులకు దిక్కులు దద్దరిల్లాయి.

"ఏంది దొరా! మా కులవృత్తి నంటారు? కులవృత్తి చెయ్యడం ఎవరికైనా గౌరవమే. కుమ్మరోళ్లు కుండలు సెయ్యకపోతే, రజకులు బట్టలు ఉతక్కపోతే, మనకు గడుస్తదా ? అట్టాగే సచ్చినగొడ్లను మేం నరక్కపోతే అసలు వూరే ఉండదు. చెమటోడ్చి పనిచేసే వాళ్లం నాయం అడిగితే తప్పా ? ఇంతాసేస్తే గుక్కెడునీళ్లకు ఇన్నిమాటలు అడుగుతారా ? మంత్రుల్ను, పోలీసోళ్లముందు మమ్మల్ని ఉద్ధరిస్తామని ఉపన్యాసాలుసెప్పి, ఆళ్ళు పోయింతర్వాత మాకు గోతులు తవ్వుతారా ? మీ పెద్దోళ్ళు, మా పెద్దోళ్లను ఇట్టాగే

చూసేవాళ్ళా? ఆళ్ళు మమ్మల్ని కన్నబిడ్డల్లా కడుపులో పెట్టుకోని ఆదుకొనేవాళ్ళు. ఇప్పుడు కాలంఅంతా తిరగబడిపోయింది'' ముసిలిగాడు ఆవేదనగా అన్నాడు.

కొద్దిక్షణాలు మౌనం రాజ్యం చేసింది.

''దొరల్లారా — ఇన్ని మాటలెందుగ్గాని మా అందరి తరఫున చేతులెత్తి మొక్కుతూ అడుగుతున్నాను. మాకిన్ని నీళ్ళిప్పించి ఈ ఎండాకాలం మమ్మల్ని ఆదుకోండి: మీ పెద్దోళ్ళ పేరు నిలబెట్టండి.'' పుల్లిగాడు రెండుచేతులూ పైకెత్తి జోడించి వణుకుతూ అన్నాడు.

''ఒరేయ్ — మా పెద్దోళ్ళు తెలివితక్కువోళ్లురా—ఆళ్ళుచేసినట్టు మేం చేస్తామా? ఇదిగో అంతా ఇనండి. మమ్మల్ని మీరు పెట్టినబాధల్ని మేమింకా మర్చిపోలేదురా— మీరు గొడ్లు నరక్కపోతే అసలు వూరే వుండదంట్రా? ఏం మీరు కోతలకు రాకపోతే మాపంట మా ఇళ్లకు రాలేదా? అట్టాగే మీరు ఎవరూ లేకపోయినా మాకు గడుసుద్దిరా — మీకు గుక్కెడు నీళ్లు కాదుకదా ఒక చుక్క కూడా ఇచ్చేదిలేదు. ఫోండి— దిక్కున్నచోట చెప్పుకోపోండిరా'' — మునసబు, శేషన్న కలిసి అరిచారు. భూషయ్య మీసాలు సన్నగాదువ్వి నవ్వాడు. మిగిలిన పెద్దలంతా మునసబు, శేషన్న మాటలకు అంగీకరిస్తున్నట్లు తలలూపారు.

పుల్లిగాడు, పుల్లిగాడి పెత్తండ్రి, ఇంకా పెద్దవాళ్లు, ఆడవాళ్లు ఎంతగానో బ్రతిమాలారు. కొంతమంది ఆడవాళ్లు కన్నీళ్లు పెట్టుకొన్నారు. కాని పెద్దల నిర్ణయం మారలేదు. పైన ఎండ పేలిపోతోంది.

''అమ్మా-మంచినీళ్ళే-మంచినీళ్లు కావాలే''—రంగిచంకలోని పిల్లవాడు గట్టిగా అరిచాడు. తల్లికసురుకొనేసరికి వాడు ఏడుపు లంకించుకొన్నాడు.

మునసబు రంగివేపుచూశాడు. రంగీ మాదిగ పాలెంలో తప్పబుట్టింది. లేకపోతే దాని ఒంటి రంగు, దానిఅందం ఆ పాలెంలో ఎవరికుంది? అసలు ఆ పూరిలోపల్నే అంత అందగత్తె మరొకర్తి లేదు. గతంలో రంగిని స్వంతం చేసుకోవాలని తనెన్నిసార్లు ప్రయత్నించాడు? కాని రంగి—అది—తనను దగ్గరకు చేరనిచ్చిందా?— కళ్లు చెదిరే మండు టెండలో పుత్తడిబొమ్మలా మిలమిలా మెరిసిపోతున్న రంగివేపుచూసిన మునసబు మనస్సులో ఎన్నో ఆలోచనలు ముసురుకొన్నాయి.

రంగి కొడుకు ఏడుపువిని మరో ఇద్దరు పసిపిల్లలు ఏడువడం ప్రారంభించారు. అప్పటిదాకా సహనంతో ఆ ఎర్రటి ఎండలో నిల్చున్న వాళ్ళందరికి పెద్దలనోటినుంచి మరోమాట రాకపోయేసరికి ఆందోళన ఎక్కువైపోయింది.

''ఇంక ఎంతసేపు నిలబడ్తా ఇంతేరా— బస్సులో పోవడానికి డబ్బుల్లేకపోతే పదిమైళ్లు నడిచి పట్నం పొండి. ఆడైతే లారీల్లో నీళ్లు సప్లయి చేస్తున్నారంట''కరణం మాటలకు మిగిలిన పెద్ద మనుషులంతా నవ్వారు.

''ఏందయ్యా! మేం మంచినీళ్లకోసం పట్నం పోవాలా? ఏం— ఎందుకుపోవాలి? ఈ ఈ వూళ్లోని గాలి, నీళ్లు, ఎల్తురు అంతా మీ సొంతమా?— మీ మీద గౌరవం కొద్దీ. ఇంతదాకా వున్న కట్టుబాటు కొద్దీ ఇంత దూరం నోరు తెరిచి గుక్కెడు నీళ్లిమ్మని అడిగాం. బదులుగా మీరు నానామాటలు అన్నారు. ఎగతాళి చేశారు. అయినా మళ్లీ మళ్ళీ బ్రతిమాలాం. చేతులెత్తి దండంపెట్టి

**పైవారమే!**
**లక్షల్లో ఒకడు**

మరీ అడిగాం. అవునయ్యా మాదే బుద్ధి తక్కువ. ఎంతయినా మేం అంటరానివోళ్ళం కదా! మీ తెలివితేటలు మాకెట్టా వొస్తాయ్? మమ్మల్ని ఆదుకొని మీ గౌరవం నిలబెట్టుకొంటారేమో అనుకొన్నాం. మాదిగోళ్లు, మాలోళ్లు అనకుండా హరిజనులు అంటూ మాకు కొత్తపేరు పెట్టగానే ఇంక మా బతుకులు బాగుపడినాయని బెమపడ్డాం. దొరల్లారా! ఇయ్యాల అసలుఇసయంతేలిపోయింది. ఎవడు అడ్డు నిలుస్తాడో చూస్తాం'' కొండడు గర్జించాడు. అంతవరకు చిత్రహింసకు గురవుతున్న వాళ్లందరికి ఒక్కసారిగా విముక్తి లభించినట్లు కుర్రకారు అంతా అంకమ్మ గుడివేపు పరిగెత్తారు.

హఠాత్తుగా సంభవించిన ఈ పరిణామానికి గ్రామ పెద్దలు నిశ్చేష్టులైనారు. వారి కళ్లల్లో మంటలు రగిలాయి. ఆ మంటలే ఆ రాత్రి మాదిగ పాలాన్ని దహించివేశాయి. పాలెం నుంచి అంతా కకావికలై పరుగెత్తిపోతూంటే గ్రామ పెద్దలంతా కసితీరా నవ్వుకొన్నారు.

ఇంతలో మునసబుకు ఏదో ఆలోచన మెరుపులా తట్టింది. అతను విసురుగా రంగి గుడిసెవేపు కాలు సాగించాడు. చంకలో పిల్లవాడితో రంగే, అతనికి ఎదురుగా వస్తూ కన్పించింది. మునసబు చటుక్కున పైగుడ్డతో ఆమె మొహం కప్పేసి, నోరు నొక్కి ఆమెను బరబరా దూరంగా వున్న గడ్డివాముల చాటుకు లాక్కుపోయాడు.

''ఏమే రంగీ! ఇయ్యాల ఎవుడు అడ్డొస్తాడే నాయాల - ఇంతకాలం నన్ను తప్పించుకు తిరిగావు 'దూ'—రంగి మొహం మీద నుంచి గుడ్డ తీసి వికృతంగా నవ్వాడు మునసబు.

''మవ్వా మునసబూ—నన్ను, నావోళ్లను నాశనంచేస్తేగాని నీ పగ సల్లారదా — పగటి పూట నేను ముట్టుకున్న నీళ్ళు పనికిరావు కాని రాత్రిపూట నేను నీకు పనికివస్తానంట్రా —ఎదవనాయల—అరేయ్ - ఈ రంగి అంటే ఎట్టాటిదనుకొన్నావో - మరేదగా వదిలావా సరే — లేకపోతే ... లేకపోతే ... '' ఆపైన ఆవేశంతో ఆమెకు మాటలు రాలేదు.

''లేకపోతే-ఏంచేస్తావే ఎరిమొగమా — నోరు మూసుకొని లొంగిపోయావా గుట్టు బయటపడదు. లేకపోతే నీకే నష్టమే —'' మీద మీదకు వస్తున్న మునసబును తప్పించుకోవడానికి వెనక్కు జరుగుతూ అక్కడ కాలికి అడ్డంగా తగిలిన పెద్ద తుమ్మమొద్దుమీద పడిపోయింది రంగి. ఆమెచంకలో పిల్లవాడు నేలమీద విసురుగా పడిపోయి గట్టిగా ఏడవడం ప్రారంభించాడు.

క్రిందపడ్డరంగికి పైట తొలగిపోవడంతో మునసబుకళ్లు బైర్లుకమ్మాయి. నిల్చున్న పళంగా అమాంతం ఆమె మీద పడి వాలిపోయాడు. తన మీద పడబోతున్న మునసబు నుండి తప్పించుకోడానికి రంగి చటుక్కున పక్కకుదొర్లింది. తుమ్మమొద్దుమీద బలంగా పడ్డ మునసబుకు ప్రక్క టెముకలు కలుక్కుమన్నాయి అతను వెంటనే లేవలేకపోయాడు. రంగికి పరిస్థితి అర్ధమైంది. మునసబును బలంగా ప్రక్కకు దొర్లించి క్రిందఉన్న తుమ్మమొద్దును విసురుగాఎత్తి మునసబు మీదకు విసిరేసి, ఏడుస్తున్న పిల్లవాడిని ఎత్తుకొని చీకట్లోకి పరిగెత్తిపోయింది. మునసబు బరువుగ మూల్గి ప్రక్కకు ఒరిగిపోయాడు.